క్లుప్తంగా

రైల్వే పెన్షనర్ల వార్షికోత్సవం



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ బ్రాంచి 2వ వార్షికోత్సవం బుధవారం ముగిసింది. ఈమేరకు కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. సంఘం అధ్యక్షుడు పోక్కుల కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ప్రధాన కార్యదర్శి జీ.సుధాకర్ వార్షిక నివేదికను సభ్యులకు నివేదించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, జోనల్ ప్రధాన కార్యదర్శి కొక్కొండ విద్యాసాగర్, బందారు ఆంజనేయులు, వడ్నాల నాగేష్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు

హన్మకొండ కల్చరల్: కార్తీక మాసంలోని మొదటి బుధవారాన్ని పురస్కరించుకుని భద్రకాళి రోడ్డులోని ధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక నిర్వాహకుడు, గురుస్వామి టీఆర్.సుబ్రమణ్యశర్మ ఆధ్వర్యంలో అర్చకుడు గణపతిశర్మ ఉదయం సుప్రభాత సేవ, విశేష ద్రవ్య అభిషేకం నిర్వహించి స్వామివారికి రాజకిరీటం ధరింపజేశారు. నిత్య పూజ, పుష్పాలంకరణ, నక్షత్ర హారతి, పంచ హారతి, కుంభహారతి, మహామంగళ, కర్పూర నీరాజనం జరిపించారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి



లక్ష్మి (ఫైల్)

హసన్‌పర్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. ఈమేరకు బాధితురాలి కుటుంబ సభ్యులు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి కథనం ప్రకారం నగరానికి చెందిన పూరేళ్ల లక్ష్మి (65) ఈనెల 13న రామారం సమీపంలోని రాధిక ఆస్పత్రి వద్ద నిలబడి ఉండగా, ఎరుకొండ దినేష్ అనే యువకుడు బైక్ నడుపుకుంటూ అతి వేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టాడు. దాంతో వృద్ధురాలికి బలమైన గాయాలయ్యాయి. వెంటనే నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి లక్ష్మి బుధవారం మృతి చెందింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

అభిమానాన్ని చాటుకున్న బీఆర్ఎస్‌వీ నాయకుడు

హన్మకొండ: తన అభిమాన నాయకుడు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ చిత్రాన్ని ఇసుకతో వేయించి బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ అభిమానాన్ని చాటుకున్నారు. వినయ్‌భాస్కర్ పుట్టిన రోజును పురస్కరించుకుని బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఇసుకతో చిత్రాన్ని వేయించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పరశురాములు, మెట్టు సంతోష్, పస్తం అనిల్, కల్యాణ్, విక్రమ్, సృజన, వాసు, వివేక్, శ్రీకాంత్, విద్యార్థి, యువత నాయకులు పాల్గొన్నారు.

భక్తులకు పండ్ల పంపిణీ

హన్మకొండ కల్చరల్: దాస్యం వినయ్‌భాస్కర్ పుట్టినరోజును పురస్కరించుకుని వేయిస్తంభాల దేవాలయంలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పులి రజనీకాంత్, చాగంటి రమేష్, రుద్రోజు సంపత్ పాల్గొన్నారు.

బీసీలు మద్దతు తెలపాలి

కాజీపేట: బీసీలకు రాజ్యాధికారం దక్కేలా పోరాటాలు చేస్తున్న సంఘాలు.. బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కోల జనార్దన్ పిలుపునిచ్చారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్, రాంమోహన్, రాజ్‌నంద్, శ్రీనివాస్ చారి, వెంకట్రాజం పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను నమ్మి మోసపోవద్దు



కరీమాబాద్: ప్రచారం చేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



ఖిలా వరంగల్: శంభునిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రదీప్‌రావు

- బీజేపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి
- పార్టీ తూర్పు అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కరీమాబాద్: ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను నమ్మి మోసపోవద్దని బీజేపీ వరంగల్ తూర్పు అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సూచించారు. గ్రేటర్ పరిధిలోని 41వ డివిజన్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్, విశ్వనాథకాలనీ, మైనారిటీ ఏరియా, దూపకుంట రోడ్, గవిచర్ల క్రాస్, ఎస్సీ కాలనీ, నాగమయ్య టెంపుల్ ప్రాంతాల్లో ప్రదీప్‌రావు బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు జరిగాయని వివరించారు. అధికారమే లక్ష్యంగా ఆచరణకు సాధ్యం కాని పథకాలతో అధికారంలోకి రావాలనుకుంటున్న, అభివృద్ధిని అడ్డుకుంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజలు దీటైన సమాధానం చెప్పాలని కోరారు. రెండు దశాబ్దాలుగా నియోజకవర్గాన్ని అంటి పెట్టుకుని ప్రజల కష్ట సుఖాలలో తోడుగా ఉంటున్న తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తనను గెలిపిస్తే అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, పింఛన్లు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అంటే ప్రజల కోసం పనిచేసే వాడని, తన స్వలాభం కోసం అవినీతితో రూ.కోట్లు సంపాదించేవాడు కాదని అన్నారు. కమలం పువ్వుకు ఓటేసి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి

ఖిలా వరంగల్: బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి చెందుతారని బీజేపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. వరంగల్ శంభునిపేట, ఫోర్ట్ రోడ్డు, ఖిలా వరంగల్‌లో బీజేపీ నేతలు కందిమల్ల మహేష్, విశ్వనాథకాలనీ అధ్యక్షుడు కర్నే రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం వేర్వేరుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంతోనే నగరం మరింత అభివృద్ధి చెందుతుందని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కొల్లూరి యోగానంద్, గంట రవికుమార్, ముత్తినేని శ్రీనివాస్, నాంద్రె అమర్‌నాథ్, పిట్టల కిరణ్, బైరి శ్యామ్ పాల్గొన్నారు.

నిబద్ధతతో బ్యాలెట్ వెరిఫికేషన్ చేపట్టాలి

వరంగల్ తూర్పు రిటర్నింగ్ అధికారి బాషా



పోస్టల్ బ్యాలెట్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: ముద్రించిన పోస్టల్ బ్యాలెట్లను నిబద్ధతతో పరిశీలించాలని వరంగల్ (తూర్పు) రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన పోస్టల్ బ్యాలెట్ వెరిఫికేషన్ ప్రక్రియను ఆర్‌ఓ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒరిజినల్ బ్యాలెట్ పేపర్ల వెరిఫికేషన్ పూర్తి చేసినట్లు, ముద్రణలో తప్పులుంటే వెంటనే సమాచారం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు రిటర్నింగ్ అధికారి అనిసుర్ రషీద్, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, పర్యవేక్షకులు ఆనంద్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్టు పార్టీలను ఓడించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీపీఎఫ్ నాయకులు

వరంగల్ చౌరస్తా: ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ ఫాసిస్ట్ పార్టీలను ఓడించాలని తెలంగాణ ఫ్రంట్ నాయకులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు వరంగల్ రైల్వే – ఆర్టీసీ బస్‌స్టేషన్ జంక్షన్‌లో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కమిటీ నాయకులు బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి బీఆర్ఎస్, బీజేపీలు అమలు కాని వాగ్దానాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలపై బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తూ, ఉపా లాంటి కేసులు పెట్టి ప్రజాసంఘాల నాయకులను వేధిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. రమాదేవి, జనగాం కుమారస్వామి, రాచర్ల బాలరాజు, కాంపల్లి ప్రవీణ్, గద్దల సంజీవ, మైదం శ్యామ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఓ ఆయుధం

హసన్‌పర్తి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది ఓ ఆయుధమని బీవీబీ పాఠశాల కరస్పాండెంట్ బుచ్చిబాబు అన్నారు. ఈమేరకు పాఠశాలలో 'అమ్మ నాన్నలు ఇవ్వండి హామీ' అనే కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీతి, నిజాయితీ గల అభ్యర్థులకు ఓటు వేయాలని ఈ కరపత్రాల్లో పొందుపరిచినట్లు వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో తప్పకుండా ఓటు వేయించేలా చూడాలన్నారు. తాము ఓటు వేస్తామనే హామీ ఇస్తూ ఆ పత్రాలపై తమ తల్లిదండ్రుల సంతకాలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆ పత్రాలను పాఠశాల ఉపాధ్యాయులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాగులం నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్, కార్యవర్గ సభ్యులు గంగారపు యాదగిరి, సాంబయ్య, వర్ధెల్లి మలహర్‌రావు, గోకారపు రాజేందర్, పిట్టల సాంబయ్య, రాజమౌళి, సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోర్, సీనియర్ సిటిజన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తేమలేని ధాన్యాన్ని తీసుకురావాలి

మామునూరు: ధాన్యం కొనుగోలు కేంద్రానికి తేమలేని నాణ్యతతో కూడిన వరిధాన్యాన్ని తీసుకురావాలని, మద్దతు ధర పొందాలని రైతులకు మండల వ్యవసాయాధికారి విజ్ఞాన్, ఏఈఓ సత్యప్రకాశ్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో వినాయక రైతు ఎంఏసీఎస్ సెంటర్ నిర్వాహకురాలు సోల్తి అభినేత్ర ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా వ్యవసాయాధికారులు హాజరై ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి, చెత్త, తాలు, మట్టి పెల్లలు, రాళ్లు లేకుండా శుభ్రం చేసి కేంద్రానికి తీసుకు రావాలని చెప్పారు. సన్నరకం ఏగ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2203లు, దొడ్డు రకం గ్రేడ్ సీకి క్వింటాల్‌కు రూ.2183లు మద్దతు ధర లభించనున్నట్లు వివరించారు. ధాన్యం తెచ్చేటప్పుడు తప్పనిసరిగా ఏఓ, ఏఈఓ సర్టిఫికెట్ కాపీ, ఆర్‌ఓఆర్ పట్టాపాస్ బుక్ జిరాక్స్, బ్యాంక్ ఖాతా జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నంబర్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ధాన్యం తెచ్చిన వెంటనే పేరు నమోదు చేసుకుని టోకెన్ నంబర్ పొందాలని చెప్పారు. సోల్తి భూమాత, తుమ్మ సాగర్‌రెడ్డి, వేమ నరెడ్డి, మచ్చిక రాజు, మురళిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ముత్యాలు, ఎల్లయ్య, మోహన్ పాల్గొన్నారు.

అభిమానులకు అండగా ఉంటా..



పుట్టిన రోజు సంబరాలు జరుపుకుంటున్న దాస్యం వినయ్‌భాస్కర్



పద్మశాలి సంఘం నాయకులతో కలిసి సీడీ ఆవిష్కరిస్తున్న వినయ్‌భాస్కర్

- కార్యకర్తలే నా బలం, బలగం
- బీఆర్ఎస్ పశ్చిమ అభ్యర్థి వినయ్‌భాస్కర్

హన్మకొండ: అభిమానులకు అండగా ఉంటానని, కార్యకర్తలే తన బలం, బలగం అని బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం ఆవరణలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య వినయ్‌భాస్కర్ పుట్టిన రోజు వేడుకలను బుధవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం, తన గెలుపు కోసం పాటుపడుతున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు.

దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలి

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని రాష్ట్ర రాష్ట్ర రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండ 52వ డివిజన్‌లో బుధవారం ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను నేరుగా కలుస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ డివిజన్ ఇన్‌చార్జ్ బొల్లికొండ వీరేందర్, నాయకులు సుగుణాకర్ రెడ్డి, అశోక్, ఉమ, సరస్వతి పాల్గొన్నారు.

దాస్యం రేవతి ప్రచారం

దాస్యం వినయ్‌భాస్కర్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి దాస్యం రేవతి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు హనుమకొండలోని 8వ డివిజన్‌లో మహిళా కార్యకర్తలతో కలిసి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వినయ్‌భాస్కర్ గెలుపునకు సహకరిస్తాం

హన్మకొండ అర్బన్: దాస్యం వినయ్‌భాస్కర్ గెలుపునకు సహకరిస్తామని పద్మశాలి కుల సంఘాల నాయకులు తీర్మానం చేశారు. ఈమేరకు నగరంలోని హంటర్‌రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన పద్మశాలి ఆత్మీయ సమ్మేళనంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ పద్మశాలి కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తానని, నగరంలోని పద్మశాలి భవన నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, అఖిల భారత పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం, నాయకులు వేముల సత్యమూర్తి, నరేందర్, చందా మల్లయ్య, ఆనందం, లక్ష్మీనారాయణ, బత్తుల రమేష్, విజేందర్, శ్రీనివాస్, రాజగోపాల్ పాల్గొన్నారు.

తెలంగాణను కాపాడుకుందాం



కరీమాబాద్ : ప్రచారంలో మాట్లాడుతున్న అరూరి రమేష్



హసన్‌పర్తి: ర్యాలీలో పాల్గొన్న అరూరి విశాల్, నాయకులు

- బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి

కరీమాబాద్ : కాంగ్రెస్, బీజేపీలు గెలిస్తే ఢిల్లీలో చేతులు కట్టుకుని నిలబడడం తప్ప చేసేదేమీ ఉండదని, ఈక్రమంలో ఢిల్లీ నేతల నుంచి తెలంగాణను కాపాడుకుందామని బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణితో కలిసి గ్రేటర్ పరిధిలోని 43,44,45 డివిజన్లలోని కడిపికొండ, అయోధ్యపురం, రాంపేట, కుమ్మరిగూడెం, ఇందిరమ్మ కాలనీ, భట్టుపల్లి, కొత్తపల్లి, అమ్మవారిపేట, జక్కలొద్ది, నక్కలపల్లి, లక్ష్మీపురం, అల్లీపురం, పెన్షన్‌పురం, మామునూరు, తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షురాలు లలితాయాదవ్, కార్పొరేటర్లు నాగేశ్వర్‌రావు, అరుణ, అధికార ప్రతినిధి ఉదయ్‌కిరణ్, ప్యాక్స్ చైర్మన్ వనంరెడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ సంపత్‌రెడ్డి, శ్రీలేఖ, కృష్ణ, రమేష్, జైపాల్‌రెడ్డి, స్పందన్, పోతుగంటి రాజశేఖర్, సతీష్, వెంకన్న, నర్సయ్య, రాజు, నర్సయ్య, మహిళలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు న్యాయం

మడికొండ: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ మడికొండలోని ఎస్సీ బీసీ కాలనీలో నాయకులు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. డివిజన్ నాయకులు అబ్బసాయిలు, రాజు, మహేందర్, ఉపేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

పర్వతగిరి: మండలంలోని చౌటపల్లికి చెందిన ముదిరాజ్ సంఘంలోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎంపీటీసీ మట్టపల్లి లావణ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తోట రాజు ఆధ్వర్యంలో అరూరి రమేష్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అరూరికి మద్దతుగా ర్యాలీ

హసన్‌పర్తి: అరూరి రమేష్‌కు మద్దతుగా మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అరూరి విశాల్ మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అభివృద్ధి – సంక్షేమ ఫలాలను అర్హులకు అందించడంలో రాష్ట్రంలోనే వర్ధన్నపేట నియోజకవర్గం ముందువరుసలో ఉందని చెప్పారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఒకటవ డివిజన్‌లో నాయకులు ప్రచారం నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, దేవేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.



పర్వతగిరి : గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేష్

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న శంకర్

కాజీపేట అర్బన్: ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీర్ శంకర్ సూచించారు. హనుమకొండ జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలసముద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల, రంగంపేట, లయోల పబ్లిక్‌స్కూల్, రెడ్డికాలనీలోని బెస్ట్ అవైలబుల్ స్కీమ్ స్కూళ్లను శంకర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ, స్టడీ మెటీరియల్స్, భోజనం, వంట సామగ్రిని పరిశీలించారు. వసతి గృహాల్లో అందజేస్తున్న వసతులపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ప్రేమకళ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్ పరిశీలన

హన్మకొండ అర్బన్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గం హనుమకొండలోని లయోలా స్కూల్ సమీపం వినాయకనగర్‌లో నిర్వహిస్తున్న హోం ఓటింగ్ విధానాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓరమేశ్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా హోంఓటింగ్ నిర్వహిస్తున్న తీరును ఎన్నికల సూపర్‌వైజర్, రూట్ అధికా రి, పోలింగ్ ఏజెంట్లు, బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈసీ నిబంధనల మేరకు హోం ఓటింగ్ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, ఓటింగ్ ప్రక్రియను తప్పకుండా వీడియోగ్రఫీ తీయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జోసెఫ్, రూట్ అధికారి దీపక్, బీఎల్‌ఓ, పోలింగ్ ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

పౌరుల అస్తిత్వానికి ప్రతీక.. ఓటు

హన్మకొండ: పౌరుల అస్తిత్వానికి ప్రతీక ఓటు అని, ఓటు హక్కును ఓటర్లందరు వినియోగించుకోవాలని ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు అశోక్ పరికిపండ్ల సూచించారు. హనుమకొండ ఆదర్శకాలనీలో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఓటరూ కాపలాదారుడేనని గుర్తుచేశారు. ఓటు హక్కు సద్వినియోగం కాకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదముందని హెచ్చరించారు. ఓటు ఎంతో విలువైనదని, ప్రలోభాలకు లొంగకుండా దాన్ని వినియోగించుకోవాలని అశోక్ చెప్పారు. ఈ కార్యక్రమంలో తేరాల యుగంధర్, దువ్వ శేఖరయ్య, గాజుల సత్యరాజు, సుజాత, విద్యావతి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పక్కదారి పట్టించారా?

- బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేయని పోలీసులు
- సీడబ్ల్యూసీకి అందించని సమాచారం.. పరిశీలించని ధ్రువపత్రాలు

సాక్షి, వరంగల్: చెన్నారావుపేట మండలంలో బాలికను వ్యక్తికి అప్పగించిన ఘటనలో పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సాధారణంగా వివాహం చేసుకున్న వారు పోలీస్‌స్టేషన్‌కు వచ్చినప్పుడు పోలీసులు తప్పనిసరిగా ఇరువురి సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. మరి ఇక్కడ మైనర్‌ను వివాహం చేసుకున్న వ్యక్తి రక్షణ కోసం పోలీస్‌స్టేషన్‌కు రాగానే.. బాలిక అని నిర్ధారించడానికి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించలేదు. తల్లిదండ్రులు కూడా బాలిక అని చెప్పినా, బాలిక పుట్టినప్పుడు ఆస్పత్రి డిశ్చార్జి కార్డులు చూపించినా పోలీసులు పరిగణనలోకి తీసుకోలేదు. బాలిక అనే విషయంలో అనుమానం ఉన్నప్పుడు వెంటనే సుమోటోగా కేసు నమోదు చేయాలి. లేదంటే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి సమాచారం ఇవ్వాలి. మహిళా సిబ్బందితో బాలికను సఖి కేంద్రానికి తరలించాలి. కానీ, ఇవేమీ చేయకుండా పెళ్లి చేసుకున్న వ్యక్తితో మైనర్‌ను పంపించడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సమాచారం అందుకున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్ధారణలో మైనర్ అని తెలిసింది. అయినా బాధ్యుడిపై కేసు నమోదు చేయలేదు. దీని వెనుక మతలబు ఏమిటి..? మంగళవారం రాత్రి 11 గంటల వరకు బాలికను సఖి కేంద్రానికి తరలించి సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారా, అసలు వెనుక జరిగిన చర్చలు ఏమిటి, సదరు వ్యక్తికి బాలికను అప్పగించిన తర్వాత ఏం జరిగింది, అకస్మాత్తుగా ఓ పెద్ద మనిషి ద్వారా రాయబారం నడిపారా అనే పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఈ ఘటనపై స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ), ఇంటెలిజెన్స్ బృందాలు రంగంలోకి దిగాయి. పూర్తిస్థాయి విచారణ తర్వాత అసలు నిజం తేలనుంది. ఈ విషయమై నెక్కొండ సీఐ హతీరాంను వివరణ కోరగా తల్లిదండ్రులు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని చెప్పారు. సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన పెద్ద మనిషి వద్దకు బాలికను పంపించి మంగళవారం సఖి కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

అభ్యర్థులు గెలిచాక వస్తా..



మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

హన్మకొండ: బీజేపీ అభ్యర్థులు గెలిచాక మరోసారి వరంగల్ నగరానికి వస్తానని, భద్రకాళి అమ్మవారిని దర్శించుకుంటానని జనసేన అధినేత, సినీ నటుడు పవన్ కల్యాణ్ అన్నారు. భద్రకాళి అమ్మవారు శక్తివంతమైన దేవత అని కొనియాడారు. హనుమకొండ హంటర్ రోడ్డులో బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో సకల జనుల విజయ సంకల్ప సభ బుధవారం జరిగింది. ఈ సభలో పవన్ కల్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 1200మంది బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని చెప్పారు. తెలంగాణ ప్రాంత అభిమానులు, జనసేన కార్యకర్తలు తాను రావాలని కోరుకుంటున్న క్రమంలో దశాబ్దకాలం తర్వాత గళం విప్పుతున్నానని పేర్కొన్నారు. బీజేపీ నుంచి వరంగల్ తూర్పు అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న రావు పద్మను గెలిపించాలని కోరారు. సభలో జనసేన నాయకుడు నాదేండ్ల మనోహర్, బీజేపీ నాయకులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, చాడా శ్రీనివాస్ రెడ్డి, రావుల కిషన్, ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కుమార్ పాల్గొన్నారు.